ప్రజాశక్తి

బుధవారం 14 జూన్ 2023 | 5 | విజయనగరం

మెరుగైన ఇంటర్ ఫలితాలు

ఫస్టియర్ 66.57 శాతం, సెకెండ్ ఇంటర్‌లో 80.76 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ఉమ్మడి జిల్లాలో మొదటి ఇంటర్ 17,238 మంది పరీక్ష రాయగా 11,475 మంది ఉత్తీర్ణులై 66 .57 శాతం ఫలితాలు నమోదు చేసి రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచారు. ఏప్రిల్‌లో విడుదలైన ఫలితాల్లో 47శాతం ఉత్తీర్ణతతో ఇదే స్థానంలో ఉండగా, ఈ సారి శాతం పెరిగినా రాష్ట్రంలో అదేస్థానంలో ఉంది. ద్వితీయ ఇంటర్ పరీక్షకు 16,655 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 13,451 మంది ఉత్తీర్ణులై 80.76 శాతం ఫలితాలు నమోదు చేసి రాష్ట్రంలో 8వ స్థానంలో జిల్లాను నిలిపారు. ఇటీవల వెల్లడైన ఫలితాల్లో 57శాతంతో రాష్ట్రంలోనే ఆఖరి స్థానంలో ఉన్న జిల్లా ఈసారి కాస్తా మెరుగైన ఫలితాలు సాధించింది.

కారిగాత కనుమరుగు

- ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి
- వందేళ్లుగా ఊరికి ఉపయోగం
- నేడు ఇరు పార్టీల అంగీకారంతో మాయం
- ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారుల అండ
- ఖాళీ స్థలాలపై నాయకుల కన్ను

కప్పేసిన కారిగాత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పల్లెటూర్లు కూడా అభివృద్ధి చెందుతున్నాయి. జనాభా పెరుగుతున్నట్లే గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు కూడా పెరుగుతున్నాయి. జల వనరుల వద్దకు ఇళ్ల నిర్మాణాలు వెళ్లడంతో ప్రజలకు, మూగజీవాలకు దాహార్తిని తీర్చి సాగు భూమికి ఉపయోగపడే కోనేరులు, చెరువులు, కాలువలు, గాతలు ఆక్రమణలకు గురవుతూ కాలక్రమమైన కనుమరుగవుతున్నాయి. వీటి ఆక్రమణల్లో రాజకీయ నాయకులు ప్రధాన పాత్ర పోషిస్తుండగా, వారికి అధికారులు కొమ్ముకాయడం కొసమెరుపు.

మండలంలోని వసి గ్రామానికి ఆనుకొని సుమారు ఎకరా 10 సెంట్లలో ఉన్న కారిగాత వందేళ్లకు పైగా ఆ గ్రామ ప్రజలకు, పశువుల దాహార్తిని తీర్చేందుకు, పశువులను కడిగేందుకు, గాత కింద ఉన్న ఆయకట్టు భూమికి నీరందించేందుకు గ్రామస్తులు వినియోగించుకునేవారు. గతంలో ఈ గాత ను అభివృద్ధి చేసేందుకు ఉపాధి హామీ పథకంలో భాగంగా రెండు, మూడు విడతలు పనులు నిర్వహించి అభివృద్ధి చేశారు. ఈగాత చుట్టూ ఊరు పెరుగు తుండడంతో కొంతమంది కళ్లు దీని పై పడ్డాయి. ఈ గాత తమ వారసులదేనని, తమ వద్ద పత్రాలు కూడా ఉన్నాయని నమ్మబలికి గ్రామంలో గల ఇరు పార్టీల నాయకులను కలుపుకొని తలా పాపం తిలా పిడికెడు అన్నట్టుగా అర్ధరాత్రి ఊరు నిద్రపోయిన సమయంలో లారీలతో మట్టిని తీసుకొచ్చి కారిగాతను కప్పేశారు.

జల వనరులను కాపాడండి

వసి గ్రామం గ్రామకంఠంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ అవసరాల కోసం, ప్రజల అవసరాల కోసం వినియోగించే భూమిని ప్రభుత్వ భూమి గానే పరిగణిస్తారు. ఈ విషయాన్ని రెవిన్యూ అధికారులు పరిశీలించి ప్రభుత్వ భూములను పరిరక్షించాలి.

మద్దిల రమణ, సిపిఎం మండల కార్యదర్శి

ఇరిగేషన్ శాఖ అధికారులే అనుమతులు ఇచ్చారు

ఉపాధి హామీ నిధులతో గాతను అభివృద్ధి చేసిన విషయం నాకు తెలీదు. కారిగాత ను కప్పేందుకు మట్టిని తోలుకునేందుకు ఇరిగేషన్ అధికారులే అనుమతులు ఇచ్చారు.

విజగాడ అప్పలరాజు

ఉపాధి నిధులతో గాతను అభివృద్ధి చేశాం

రికార్డు ల్లో గ్రామ కంఠంగా ఉండడం గ్రామస్తుల అవసరాలకు ఈ గాత ఉపయోగ పడుతుండడంతో 2019 వరకు పలుమార్లు ఉపాధి హామీ నిధులతో వసి కూలీలతో పని చేయించి ఈ కారిగాతను అభివృద్ధి చేశాం.

గుమ్మడి ఎర్రిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్, వసి గ్రామం

నిరాడంబరంగా నిర్విరామ అడుగులు

కలెక్టర్ నాగలక్ష్మి స్టైలే వేరు

క్షేత్రస్థాయి పర్యటనలు..లోతైన సమీక్షలు

ఆమె జిల్లాకు అత్యున్నత అధికారి...కానీ, అత్యంత నిరాడంబరం. చిటిక వేస్తే అవసరానికి మించిన సమాచారం... కానీ, క్షేత్ర స్థాయి పరిశీలన చేయకుండా నిర్ధారణకు రానేరారు. సమావేశాలు, సమీక్షలతో నిత్యం బిజీబిజీ... కానీ, కోపం మచ్చుకైనా కనిపించదు. మాట వెన్నపూస... సమీక్ష మాత్రం పాతాళం. ఒకటికి రెండు సార్లు చెప్పేంత సహనం... పదేపదే తప్పులు చేస్తే తాటతీసేంత తరకం. ఆమె ఎవరో కాదు. మన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్. సింపుల్‌సిటీకి మారుపేరుగావున్న నాగలక్ష్మి మన జిల్లాలో అధికార బాధ్యతలు చేపట్టి సరిగ్గా రెండు నెలలు గడిచింది. ఈ నేపథ్యంలో ఆమె పనితీరు, వ్యవహారశైలిపై ప్రజాశక్తి అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

చెరువుగట్టెక్కి ఉపాధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది ఏప్రిల్ 12న కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ నాగలక్ష్మి భిన్నమైన శైలిలో పాలన సాగిస్తున్నారు. ఒకవైపు జిల్లా స్వరూపాన్ని, భౌగోళిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకుంటూనే, మరోవైపు పాలనలో పటుత్వం తగ్గకుండా జిల్లాను ముందుకు నడిపిస్తున్నారు. కేవలం అధికారులిస్తున్న సమాచారం, లెక్కలతో సంతృప్తి చెందకుండా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్నారు. ఆమె పనిచేసేది ఈ రెండు నెలల కాల వ్యవధిలో మెజారిటీ కాలంలో క్షేత్ర స్థాయి పర్యటనలోనే ఉన్నారు. పర్యటనల్లో అధికారులు, సిబ్బంది కన్న ప్రజా సమస్యలు వినేందుకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. పర్యటనల్లో అటు ప్రజలతోనూ, ఇటు ప్రభుత్వ సిబ్బందితోనూ ఎంతో సహనంగా మాట్లాడుతూ లోపాలను గుర్తిస్తున్నారు. సూచనలు, సలహాలు కూడా ఎంతో సౌమ్యంగా చెబుతున్నారు. మరోవైపు రోజువారీ సమావేశాలు, పర్యటనల షెడ్యూల్ కూడా ఇప్పటి వరకు క్రమం తప్పిన సందర్భాలు లేవని చాలా మంది జిల్లా అధికారులు చెబుతున్నారు. సమీక్షల్లో గతం మాదిరిగా ఏదో ఒకటి చెప్పేద్దాం అనుకుంటే కుదిరే పరిస్థితి లేదని, వరుసగా రెండోసారి కలెక్టర్‌గా పనిచేయడం వల్ల చాలా నిర్దిష్టంగా, స్పష్టంగా అడుగుతున్నారని అధికారులు చెబుతున్నారు. అవసరమైన సందర్భాల్లో సుతి మెత్తగానే హెచ్చరిస్తున్నారు. పర్యటనలు, సమీక్షల్లో కోపం, ఆగ్రహం వంటివి కనిపించకపోయినప్పటికీ లోపాలను నిర్మొహమాటంగా ఎత్తిచూపుతున్నారని మరికొందరు అంటున్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన వినతులను సైతం క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తున్నారు. రాజకీయ సిఫార్సులకన్నా సమస్య ప్రాధాన్యత, వాస్తవ పరిస్థితులకే ప్రాధాన్యతనిస్తున్నారని కొంతమంది నోట వినిపిస్తోంది. ముఖ్యంగా సింప్లిసిటీ విషయంలో ఆమె ఐఎఎస్‌కే ఆదర్శం. చదువుకున్న యువత, విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులకు ఆదర్శవంతమైన ఈమె సందేశమేనని పలువురు చర్చించుకుంటున్నారు.

గ్రీన్ ఫీల్డ్ రహదారి, గిరిజన యూనివర్సిటీ రైతులకు

మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - గజపతినగరం

గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి, గిరిజన యూనివర్శిటీ నిర్మాణాలకు రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా నాయకులు జి.శ్రీనివాస్, వి.లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం, అధికారులు చూడాల్సింది పోయి నష్టపరిచే విధంగా బలవంతంగానే భూములు సేకరించారని పేర్కొన్నారు. రైతులు పోరాడితేనే కాస్త కూస్తో నష్ట పరిహారం పెంచారని తెలిపారు. భూములు త్యాగం చేసిన రైతులకు మార్కెట్ ధర ప్రకారం లేదా 2013 భూ సేకరణ చట్టం ప్రకారం అయినా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సాగు భూములకు, డి పట్టా భూములకు, జిరాయితీ భూములకు సమానంగా నష్టపరిహారం చెల్లించకుండా రైతులకు అన్యాయం చేయడం సరికాదని అన్నారు. రైతుల భూ సేకరణ విషయంలో అక్రమాలు జరిగినట్లు ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు చేసుకుంటున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తక్షణం రైతులకు మెరుగైన పరిహారం కోసం కృషి చేయాలని కోరారు.

ముందుగానే సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప‌స్తుతం మహారాజ (ఎ) డిగ్రీ కళాశాలలో ఫైనల్ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు ముందుగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని కోరుతూ కళాశాల ఎస్ఎఫ్ఐ కమిటీసభ్యులు కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావును కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మహారాజ కళాశాల కమిటీ కార్యదర్శి వెంకటరమణ మాట్లాడారు. 2020- 2023 బ్యాచ్ విద్యార్థులు మరోనెల రోజుల్లో కళాశాల నుండి రిలీవ్ అవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, కాని కొంతమంది గత సెమిస్టర్ పరీక్షల్లో ఒకటి రెండు సబ్జెక్టులు ఫెయిల్ అవ్వడంతో ,వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈనెలలో జరుగుతున్న అండర్ 2019బ్యాచ్‌ల సప్లిమెంటరీ ఎగ్జామ్స్‌తో పాటు కలిపి నిర్వహించాలని కోరారు. దీని పట్ల సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపాల్ సాంబశివరావు గారు పరీక్షలను ముందుగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. వినతిచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రమేష్ తదితరులు ఉన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై జగన్ నోరువిప్పాలి

ప్రజాశక్తి - విజయనగరం కోట

కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షా ప్రకటనలపై ముఖ్యమంత్రి నోరు విప్పి సమాధానం చెప్పాలని డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగన్ పాలన పూర్తిగా అవినీతి మయమని, మైనింగ్, భూ దందాలు, నకిలీ మందుల వ్యాపారం, అవినీతి కుంభకోణాలు తప్ప మీరేమీ లేవని అన్నారు. అమిత్‌షా 2014 నుండి 23 వరకూ ఆంధ్రప్రదేశ్‌కు రూ.2.30లక్షల కోట్లు సహాయం చేసినట్లు ప్రకటించారని, దీనిపై ముఖ్యమంత్రి వాస్తవాలు చెప్పాలని అన్నారు. బిజెపినే కాదు, ఆ పార్టీతో పొత్తు ఉండే పార్టీలను కూడా మట్టి కరిపించాలని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకత హోదా అమలు కాకుండా, ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అమలు చేయకుండా ద్రోహం చేసిన బిజెపిని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ క్షమించరని అన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలన్నీ ప్రత్యక్షంగా, పరోక్షంగా బిజెపితో అంట కాగుతున్నాయని ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గ్రహించి బిజెపితో రాజీలేకుండా పోరాడుతున్న కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు.

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతాంశంగా స్వీకరించి సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని సచివాలయ కార్యదర్శులకు, సిబ్బందికి ఇన్చార్జి కమిషనర్ ప్రసాదరావు ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా ఇంజనీరింగ్ విభాగంలో వస్తున్న ఫిర్యాదులు పరిష్కారానికి నెలకొంటున్న క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళిక విభాగంలో ఇకపై జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపట్ల ఉపేక్షించబోమని హెచ్చరించారు. వచ్చిన ఫిర్యాదులను కాలపరిమితి లోగా పరిష్కరించాలని చెప్పారు. వీటిపై సంబంధిత డిఇలు, ఎఇలు నిరంతర పరిరక్షణ చూపాలని అన్నారు. సమావేశంలో ఇఇ కె.శ్రీనివాసరావు, డిఇ అప్పారావు, ఎఇలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కలశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్‌హబ్‌లో శిక్షణ పొందిన అభ్యర్థలకు శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కళాశాల ఎపిఎస్ఎస్‌డిసి సమన్వయకర్త జి. ఈరన్న, ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. కేశవ రావు మాట్లాడుతు నిరుద్యోగ యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో ఉచిత శిక్షణా కల్పించిందన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ ఎన్. గోవింద్ రావు, మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో స్కిల్‌హబ్‌లు ఏర్పాటు చేసి 3 నెలలు శిక్షణ ఇచ్చి ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు.

టిడ్కో గృహ సముదాయాల్లో

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

సోనియానగర్, సారిపల్లి కాలనీలను సందర్శించిన కలెక్టర్ • సచివాలయాలు, పాఠశాలలు తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం

పట్టణ పేదల సౌకర్యార్థం నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో ఆధునిక మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, పనుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ టిడ్కో అధికారులను ఆదేశించారు. పట్టణీకరణ ప్రమాణాలకు అనుగుణంగా యుజిడి, విద్యుదీకరణ, అంతర్గత రోడ్లు, తాగునీటి వసతులను కల్పించాలని సూచించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి నిర్ణీత గడువులోగా లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మంగళవారం సోనియానగర్, సారిపల్లిలోని డిడ్కో గహ సముదాయాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల పనులను పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం 480 గృహాలను సంబంధిత లబ్ధిదారులకు వీలైనంత త్వరగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. సోనియానగర్‌లో విద్యుదీకరణ పనులు వీలైనంత త్వరగా ముగించాలని చెప్పారు. టిడ్కో ఇఇ జ్యోతి, ఇతర అధికారులు, విజయనగరం మున్సిపల్ ఇన్చార్జి కమిషనర్ ప్రసాదరావు, విజయనగరం తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రజలకు నాణ్యమైన సేవలందించాలి

టిడ్కో గహ సముదాయాల సందర్శన అనంతరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ పూల్‌బాగ్ కాలనీలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, సచివాలయం-2ను తనిఖీ చేశారు. ప్రజలకు అన్ని విధాలుగా నాణ్యమైన సేవలందించాలని ఈ సందర్భంగా ఆమె సంబంధిత అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. పట్టణ ఆరోగ్య కేంద్ర తనిఖీలో భాగంగా ల్యాబరేటరీ, ఫార్మసీ, ఇతర విభాగాలను సందర్శించారు. ఈ క్రమంలో కలెక్టర్ స్వయంగా ఇహెచ్ఆర్(ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్) విధానాన్ని పరిశీలించారు. ఆసుపత్రులో అందుబాటులో ఉన్న మందులు రోగులు పంపిణీ చేస్తున్న మందుల వివరాలను సరిచూశారు. పూల్‌బాగ్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను

సారిపల్లిలో టిడ్కో ఇళ్ల ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సందర్శించి నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం కొత్తపేట కుమ్మరవీధిలోని 17వ నెంబర్ సచివాలయాన్ని, వివేకానంద ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.

కుమ్మరవీధి పాఠశాల అప్ గ్రేడ్‌పై సానుకూల స్పందన

కొత్తపేట కుమ్మరవీధిలోని వివేకానంద ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ను స్థానిక 14వ డివిజన్ కార్పొరేటర్ రాజేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. నాడు-నేడు పనుల్లో భాగంగా పాఠశాలను బాగా అభివృద్ధి చేశామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలను యుపి స్థాయికి అప్ గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ డిఇఒ ద్వారా సంబంధిత ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పర్యటనలో ఆమెతో పాటు మున్సిపల్ ఇన్చార్జి కమిషనర్ ప్రసాదరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర రావు, డిఐఒ డాక్టర్ శృతి, విజయనగరం తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ సత్యనారాయణ, ఇతర విభాగాల అధికారులు ఉన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పేదలు

ధరలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, అధిక పన్నుల భారాలను ఉపసంహరించాలని, సామాన్యులకు షాకిస్తున్న అదనపు విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని ఎన్ వై ఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా నిత్యావసర సరుకులైన బియ్యం, పప్పులు, వంట నూనెలు, తదితర అనేక రకాల వస్తువుల ధరలు ఆకాశంలో చుక్కలను తాకుతూ సామాన్యులు ఏమీ కొని తినలేని పరిస్థితి నెలకొందని అన్నారు. పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని కోరారు.

వాహనం ఢీకొని జింకకు గాయాలు

ప్రజాశక్తి - బొండపల్లి

అంబటివలస సమీపంలోని సత్యం స్కూలు వద్ద అడవుల్లోనుంచి వచ్చి జాతీయ రహదారి దాటుతున్న జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. గాయపడిన జింకను చూసి స్థానికులు హైవే పెట్రోలియం వాహనానికి సమాచారం ఇచ్చారు. ఎఎస్ఐ జి.వెంకటేశ్వరరావు అటవీశాఖ బీట్ ఆఫీసర్ రవికుమార్‌కు తెలియజేయడంతో ఆయన వచ్చి ప్రథమ చికిత్స చేయించారు. ఇటీవల నెలివాడ కొండలపై తవ్వకాలు జరగడం వల్ల జింక జనారణ్యంలోకి వచ్చినట్లు తెలుస్తోంది.

గాయపడిన జింక

రహదారుల అభివృద్ధే ధ్యేయం

జన్నివలస బిటి రోడ్డును ప్రారంభించిన వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-రామభద్రపురం

వైసిపి ప్రభుత్వ పాలనలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రహదారుల నిర్మాణాలకు నిధులు కేటాయిస్తున్నామని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఎస్‌వి చిన అప్పలనాయుడు అధ్యక్షతన మంగళవారం కొట్టక్కి కూడలి నుంచి జన్నివలసకు నూతనంగా నిర్మించిన బిటి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ శత శాతం అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్ ఒక్కరేనని అన్నారు. విద్య,వైద్య రంగాల్లో వినూత్న మార్పులు తీసుకురావడం ద్వారా నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా చూసి పరిపాలన సాగిస్తోందని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పాటు ఉపాధి హామీ ధులతో రహదారుల నిర్మాణం, సాగునీరు అందించే కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఈ నాలుగేళ్లలో సుమారు రూ. 87కోట్ల ఖర్చు చేసి రహదారులు, సాగు, తాగు నీటి సరఫరా చేశామని తెలిపారు. అనంతరం ఎంపి లాడ్స్ నిధులు సుమారు రూ.3లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్ ను ఎంపి ప్రారంభించారు. అనంతరం ఆర్గానిక్ బెల్లం తయారు చేసిన రైతులు ప్రభుత్వం బెల్లం కొనుగోలుకు తగు చర్యలు తీసుకోవాలని టిటిడి ఛైర్మన్‌ను కోరారు. సుబ్బారెడ్డి స్పందిస్తూ వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో స్థానిక మండల పరిషత్ అధ్యక్షులు చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ రాయలు, బుడా ఛైర్మన్ ఇంటి పార్వతి, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

కొత్తవలస : హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి

రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం

కొత్తవలస : వికలాంగుల సంక్షేమం కోసం ఓ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి దేశంలోని నలుమూలల అద్భుతమైన సేవలందిస్తున్న శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ఆదర్శప్రాయమని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి కొనియాడారు. మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్ట్‌ను విశాఖ ఎమ్‌పి ఎంవివి సత్యనారాయణ, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. ట్రస్ట్ ప్రాంగణంలోని అవయవ తయారీ కేంద్రాన్ని, గురుదేవ హాస్పటల్‌ను సందర్శించారు. నూతనంగా ఏర్పాటుచేసిన రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ భవనం, మినరల్ వాటర్ ప్లాంట్ లను సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం పలువురు వికలాంగులకు కృత్రిమ కాళ్ళు, చేతులు, వినికిడి పరికరాలు, ఉపకారణాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కోప్పలవెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, వైసిపి నాయకులు గొరపల్లి శివ, బొంతల వెంకటరావు, పంచదార్ల శ్రీను, ఆతవ రమేష్, ఐతంశెట్టి శ్రీను, అనిల్, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల సిఇఒ కె. నిరంజన్ కుమార్, విశాఖ స్మార్ట్ సిటీ ఛైర్మన్ జి. వెంకటేశ్వరరావు, ట్రస్ట్ ఛైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్, వైస్ ఛైర్మన్ ఫణీంద్ర, ట్రస్ట్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సంపూర్ణ వసతులతో టిడ్కో ఇళ్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించి త్వరలో టిడ్కో ఇళ్లు అందజేసేందుకు అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తున్నట్లు హౌసింగ్ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈమేరకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో హౌసింగ్ కమిటీ, నగరపాలక సంస్థ మరియు హౌసింగ్ అధికారులతో సమావేశం జరిగింది. టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందజేయడంలో నెలకొన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సత్వరంగా చొరవ చూపాలని అధికారులకు ఆదేశించారు. ఇన్చార్జి కమిషనర్ ప్రసాద్ రావు మాట్లాడుతూ నగరంలో సారిపల్లి, సోనియా నగర్ ప్రాంతాలలో టిడ్కో ఇళ్లు రూపుదిద్దుకున్నాయన్నారు. సారిపల్లిలో 157, సోనియా నగర్ లో 147 ఇల్లుకు సంబంధించి వివిధ రకాల కారణాలతో లబ్ధిదారులకు అందజేయడంలో ఆలస్యం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రుణ సదుపాయం అందక, కొంతమంది అందుబాటులో లేకపోవడం వల్ల ఇళ్లను అందించడంలో జాప్యం జరుగుతుందన్నారు. సమస్యలను పరిష్కరించి లబ్ధిదారులకు త్వరితగతిన ఇల్లు అందజేసే ఏర్పాట్లు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హౌసింగ్ కమిటీ సభ్యులు గాదం మురళి, హౌసింగ్ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఘోషాస్పత్రికి 5 ఎసిలు వితరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఘోషాసుపత్రికి అవసరమైన ఐదు ఎసిలను భవన నిర్మాణ సంస్థ యజమానులు ఆసుపత్రి సూపరింటిండెంట్ అప్పలనాయుడుకు, నగరపాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ ప్రసాద్ రావు సమక్షంలో అందజేశారు. వాస్తవానికి ఘోషాసుపత్రిలో శీతలీకరణ యంత్రాలు లేక నవజాత శిశువులు, గర్భిణీలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వైనాన్ని తెలుసుకున్న కలెక్టర్ నాగలక్ష్మి సూచన మేరకు నగరపాలక సంస్థ అధికారులు నగరంలో ఉన్న భవన నిర్మాణ యజమానులకు సహకరించవలసిందిగా కోరారు. దీంతో ముందుకు వచ్చిన లాసన్స్ డెవలపర్స్, ఎస్. నారాయణరావు, జి.సురేష్, ఎన్.శేఖర్, శివాజీ వర్మ, కేదారిశెట్టి సీతారామమూర్తి తమ వంతు సహాయంగా ఒక్కొక్క ఎసి చొప్పున అందజేశారు. రోగుల ఇబ్బందులను దష్టిలో పెట్టుకొని అడిగిన వెంటనే శీతలీకరణ యంత్రాలను అందజేసిన భవన నిర్మాణ యజమానులకు కమిషనర్ ప్రసాదరావు అభినందనలు తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి - వంగర

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతుందని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఈ మేరకు ఎం సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యూకే గుమ్మడ పాఠశాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం రవణమ్మ, సూర్య చంద్ర రావు చేతుల మీదుగా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే జోగులు మండలంలోని కొండచాకరాపల్లి, వివిఆర్‌పేట గ్రామాలలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శన్‌రావు, ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు, ఎంఇఒ వై దుర్గారావు, జయకృష్ణ మాస్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జెబికె కిట్లను పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ రామారావు

రేగిడి : జగనన్న విద్యా కానుకలు విద్యార్థులు వినియోగించుకోవాలని వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్మోహన్ రావు, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరు పట్టాభి, వైసిపి నాయకులు రెడ్డి నర్సింగరావు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ లక్ష్మి జ్యోతి, హెచ్ఎం మరిచర్ల రామినాయుడు పాల్గొన్నారు.

భామిని: ఆకులకట్ట పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ ఉయ్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ప్రభుత్వ విద్యకు తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. మంగళవారం జరజాపు పేట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నల్లా జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జెబికె కిట్లను రామారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విద్యా రంగానికి తొలి ప్రాధాన్యత ఇచ్చి ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నాడు నేడు కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లి శ్రీను, మద్దిల వాసు, తుమ్ము నారాయణ మూర్తి, కనకల హైమా వతి, మాతసంధ్య, పిఎంసి చైర్మెన్ కాళ్ళ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐటిఐలో ప్రవేశాలకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - విజయనగరంకోట

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ)ల్లో ప్రవేశాలకు ఈనెల 14 నుంచి 19 వరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని జిల్లా కన్వీనర్, స్థానిక ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని ధ్రువపత్రాలు పరిశీలన చేసుకున్న అభ్యర్థులకు మెరిట్ ప్రాతిపదికన కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. కావున అభ్యర్థులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. కౌన్సిలింగ్ ఉదయం 9గంటల నుంచి 1గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

కౌన్సిలింగ్ షెడ్యూల్

14న 1నుంచి 253 ర్యాంకు వరకు
15న 254నుంచి 576 వరకు
16న 577 నుంచి 895 వరకు
17న 896 నుంచి 1092 ర్యాంకు వరకు జరుగుతుంది.
18, 19న జనరల్‌కు జరుగుతుంది.

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం, 202 కాలనీలో గల అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ పిడి బి. శాంత కుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో ఉన్న పిల్లలను చక్కగా చూడటంతో పాటు వారి ఆరోగ్య విషయంలో కూడా శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లలు తీసుకొని ఆహార విషయంలో గాని, శారీరక మానసిక ఎదుగుదలకు అంగన్వాడి కార్యకర్తలు తగినంత కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత అవసరాలను గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాలని తెలిపారు. కేంద్రాల్లో పిల్లలతో పాటు బాలింతలు, గర్భిణులు పట్ల తగిన శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పిల్ల బరువు తూచాలని తెలిపారు. కేంద్రాల్లో నిర్వహిస్తున్న రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిఒ రొంగలి ఉమాదేవి, సూపర్‌వైజర్ రమణమ్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి

బొబ్బిలి: పిట్‌నెస్ లేని పాఠశాలల బస్సులను సీజ్ చేయాలని విద్యార్థి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సాయికిరణ్ యాదవ్ డిమాండ్ చేశారు. జెండామాల్ జంక్షన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల బస్సులకు ఫిట్నెస్ లేకపోయిన తిప్పుతున్నారని ఆరోపించారు. ఫిట్నెస్ లేని బస్సులు తిప్పి విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న బస్సులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్‌టిసి ఆదాయం పెంచాలి : చైర్‌పర్సన్

నెల్లిమర్ల: ప్రయాణికులపై ఎటువంటి భారమూ పడకుండా ఆర్‌టిసి ఆదాయం పెంచాలని ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ కోరారు. జోన్-1లో మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేసి జిల్లా ప్రజా రవాణాధికారిగా బదిలీపై వచ్చిన సి.హెచ్ అప్పలనారాయణ భాధ్యతలు స్వీకరించి ఆమెను వెలగాడలోని తన స్వగృహంలో మర్వాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. సిబ్బంది సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ జె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ పట్నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను ఆయన పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని నాణ్యత లోపం లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఇంతవరకు సచివాలయం సిబ్బంది భీమా పథకం అమల విధానం గూర్చి అనుసరించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కన్నంనాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన చిన్నారులకు చర్చిలోనే బడి

వేపాడ : మండలంలోని వీలుపర్తి పంచాయతీ పరిధిలో గల చినదుంగాడ గిరిజన గ్రామంలో 20 మంది పిల్లలున్నారు. వీరికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాఠశాల భవనం పూర్తిగా శిథిలం అయిపోవడంతో పిల్లలకు శిథిలమైన భవనంలో విద్యాబోధన సాగించడం ప్రమాదకరంగా తయారైంది. గోడల బీటల వారి ఉండడంతో పిల్లలపై ఎప్పుడు కూలి పడుతుందో నన్న భయంతో పక్కనే ఉన్న చర్చిలో విద్యాబోధన ప్రారంభించారు. ఈ చర్చి కూడా వర్షం వస్తే నీరి చేరిపోయే ప్రమాదం ఉంది. ఇన్ని ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని ఇక్కడ నాడు నేడు కింద భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా నిర్మాణం మాత్రం ముందుకు కదలడం లేదు. దీంతో గతేడాది కష్టాలే విద్యార్థులను వెంటాడుతున్నాయి. భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి విద్యార్థులకు అందించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా కాలబైరవ స్వామి పండగ

కొత్తవలస: మండలంలోని చింతలపాలెం గ్రామంలో శ్రీ కాళభైరవ స్వామి నవరాత్రి పండగ గ్రామ సర్పంచ్ మాకిన సీతారాం పాత్రుడు(నవీన్) ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలకు ఒక్కసారి చింతలపాలెం గ్రామంతో పాటు గొల్లపేట, తాడివానిపాలెం, దేశపాత్రునిపాలెం, సరిపల్లి, ముదపాక మొత్తంగా ఏడు గ్రామాలు ప్రజలు కుల మతాలకు అతీతంగా కాలభైరవ స్వామి పండగ ఆనవాయితీగా జరుపుకుంటున్నామని తెలిపారు. అనివార్య కారణాల వల్ల 2008 తరువాత 15 సంవత్సరాల సుదీర్ఘ విరామం అనంతరం కాలభైరవ స్వామి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ గ్రామ దేవత పండగలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అనేక ప్రత్యేక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

రాజా కళాశాల మైదానాన్ని శుభ్రం చేయండి

బొబ్బిలి: రాజా కళాశాల మైదానంలో వ్యర్ధాలను ఏరివేసి శుభ్రం చేయాలని శానిటేషన్ సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశించారు. పట్టణంలోని రాజా కళాశాల మైదానం, వెలమవారివీధి, మెహర్ కాలనీలో పారిశుధ్య పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. కళాశాల మైదానంలో వ్యర్ధాలు ఉండడంతో వ్యర్ధాలను ఏరివేసి శుభ్రం చేయాలన్నారు. వెలమవారివీధి, మెహర్ కాలనీలో కాలువల్లో పూడికలు తొలగించాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలను కోరారు. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగించి యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు.

స్టీల్ గ్లాసులు పంపిణీ

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో తరగతి నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు జగనన్న గోరుముద్ద స్టీల్ గ్లాసులను పిఎంసి చైర్మన్ తగరంపూడి రమణ, హెచ్ఎం సబ్బవరపు వెంకటరావు చేతులు మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. వారంలో మంగళ, గురు, శనివారాల్లో జగనన్న గోరుముద్దలో భాగంగా 'రాగిజావ' పంపిణీ చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. గతంలో ప్రతి విద్యార్థి తమ ఇంటి నుండి గ్లాసులను తెచ్చుకొని రాగిజావని తాగేవారు. ఇప్పుడు గ్లాసులను కూడా ప్రభుత్వమే అందిస్తుంది. ఇందులో భాగంగా విద్యార్థులకు గ్లాసులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు

మెంటాడ: మండలంలోని కొండ లింగాలవలస అగ్ని ప్రమాద బాధితులకు మంగళవారం జనసేన ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పొట్టా శేఖర్ నాయకులతో కలిసి గ్రామానికి వెళ్లి గ్రామంలో అగ్నిప్రమాద బాదిత ఐదు కుటుంబాలతో మాట్లాడారు. ప్రమాదంలో సర్వం కోల్పోయి, కట్టు బట్టలతో మిగిలిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు అగ్ని ప్రమాదం జరిగి 24 గంటలు గడిచినప్పటికీ తక్షణ సాయం అందించకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. బాధిత గిరిజన కుటుంబాలను అధికారులు పరామర్శించి తక్షణ సాయాన్ని అందివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితులకు బియ్యం, కందిపప్పు, నూనె ప్యాకెట్లు, బంగాళదుంపలు, పప్పు దినుసులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తమలపాటి చిన్నంనాయుడు, ఏ. సూర్యనారాయణ, నీలావతి గౌరీ శంకర్, మజ్జి హరికృష్ణ, మోసూరు రాఘవాచారి, జనసేన పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ కళాకారుడు మృతి

నెల్లిమర్ల: నగర పంచాయతికి చెందిన సీనియర్ కళాకారుడు డివి సత్యనారాయణ (87) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. సత్యనారాయణ 80, 90 దశకంలో 'మధ్యంలో మానవుడు, 'సమాజం చావనివ్వదు, 'పట్నంలో ఒక రాత్రి, రక్త కన్నీరు వంటి నాటకాల్లో నటించారు. సీనియర్ కళాకారులు అల్లూరి సీతారామరాజు, ఆరిపాక బ్రహ్మానందంలతో రంగ స్థలాన్ని పంచుకొని అభినయించారు. కాగా నెల్లిమర్ల గ్రామ పంచాయితీలో ఉద్యోగిగా సేవలు అందించారు. కుమారుడు కుమార్తె ఉన్నారు.

అగ్రహారం రైతులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి - జామి

అగ్రహారం భూ సమస్య పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తామని తహశీల్దార్ హేమంత్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పక్షాలు, ప్రజాప్రతినిధులు, రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఒక్కొక్కరి నుంచి అభిప్రాయాలు సేకరించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ, గత నెల 25న అగ్రహార భూములకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశామని అన్నారు. ఈనామ్ చట్టం ప్రకారం రైతుకి 2/3, ఈనాముదారునికి 1/3 భూమి కేటాయించాల్సి ఉందన్నారు. కానీ దశాబ్దాల కాలంలో అగ్రహారం భూములకు సంబంధించి అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. అయితే ఇప్పటికే కొంత మంది ఈనాముదారుల నుంచి రిజిస్ట్రేషన్ల చేసుకోగా, కొంత మందికి పట్ట పాసుపుస్తకాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సర్వే ఎక్కువ కాలం జరిగిన నేపథ్యంలో కొంత తప్పిదాలు కూడా చోటు చేసుకున్నాయని అన్నారు. కాబట్టి ఈ నోటిఫికేషన్ ద్వారా ప్రతి ఒక్క రైతు నుంచి అభ్యంతరాలు స్వీకరించి, వాటిని సరి చేసుకునే అవకాశం ఉందన్నారు. కాబట్టి రైతుల అభ్యంతరాలు కోసం తహశీల్దార్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామని, సచివాలయాల పరిధిలో గ్రామ సభలు పెట్టి, రైతులను నేరుగా కలుస్తామని అన్నారు. ఈనాము దారునికీ 1/3 కేటాయింపుతో రైతుకు నష్టం జరిగిపోతుందని ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. యాక్ట్ ప్రకారం కేటాయించామని, కానీ ఈనాము దారులు రుజువు చేసుకోవడానికి అంత సులువుకాదని అన్నారు. రైతువారి పట్టా ఇస్తూనే, ఈనం కేటాయించిన భూమిని రైతు సాగులో ఉన్నట్లు చూపిస్తామని, చట్ట ప్రకారం అగ్రహారం రైతుకు 100 శాతం న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ గోర్లె రవికుమార్, జామి మేజర్ పంచాయితీ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, న్యాయవాది బూసర్ల రమణారావు, రైతులు, పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి- రేగిడి

రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు 4 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లకు సంబంధించి సంక్షేమ బోర్డు నిధులను వెంటనే విడుదల చేసి, కార్మికులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.రమణ డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఉంగరాడ మెట్ట వద్ద భవన నిర్మాణ కార్మికులతో సమావేశం అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు ఏ ఒక్క మేలు జరగలేదని, కార్మికులు లేబర్ డిపార్ట్ మెంట్‌కు దరఖాస్తు చేసుకున్న పెండింగ్ క్లయిమ్‌లు కోసం వేలాది మంది కార్మికులు ఎదురుచూస్తున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డు ద్వారా అనేక రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికు లను కరోనా కాలంలో ఆర్థికంగా ఆదుకున్నారని, మన రాష్ట్రంలో కరోనా కాలంలో భవన నిర్మాణ కార్మికులకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఆశ చూపి నేటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో 40 లక్షల కుటుంబాలు భవన నిర్మాణ రంగంలోనే ఆధారపడి పని చేస్తున్నారని వాళ్లకు మరో ఆధారం లేదని ఇటువంటి వారిని ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా పట్టించుకోకపోవడం సరైనది కాదని అన్నారు. సంక్షేమ బోర్డులో ఉన్న 1000 కోట్లు నిధులను కార్మికులకు ఖర్చు చేయకుండా ప్రభుత్వం తన సొంత అవసరాలకు వాడుకోవడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం. త్రినాథ్, రవిశంకర్, తిరుపతిరావు, రాము, రవి, తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

షాపుల వేలం వాయిదా

విజయనగరం టౌన్: స్థానిక రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గల షాపుల బహిరంగ వేలంపాటను వాయిదా వేసినట్లు నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ ప్రసాద్ రావు తెలిపారు. రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద నిర్మించిన 22 షాపులకు గాను బహిరంగ వేలంపాటను నిర్వహించేందుకు ప్రకటన వెలువరించారు. ఈ మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన వేలంపాటకు ఆసక్తి కలిగిన, తగిన ఆర్థిక స్థోమత కలిగిన అసామీల నుండి ఆశించిన స్థాయిలో సత్వర స్పందన లేనందున వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ప్రసాద్ రావు తెలిపారు. తదుపరి జరగబోయే వేలంపాట వివరాలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీల్లో స్వర్ణ పతకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గరికిపేట క్రీడా కారిణికి స్వర్ణ పతకం లభించింది. ఉత్తర ప్రదేశ్ నోయిడాలో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా యూనివర్శిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గరికి పేటకు చెందిన క్రీడా కారిణి బెల్లాన నాని ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకం సాధంచింది. 71కిలోల విభాగంలో నాని స్నాచ్ 78 కిలోలు, క్లీన్, జర్క్ 103 కిలోలు మొత్తం 181కిలోలు బరువెత్తి స్వర్ణ పతకం సాధించింది. అంతక ముందు అఖిల భారత స్కూల్ గేమ్స్ పోటీల్లో రజిత పతకం, రాష్ట్ర స్థాయిలో 20 పతకాలు సాధించింది. కొండవెలగాడలో కోచ్ బూసరి రవి వద్ద గత 5సంవత్సరాలుగా శిక్షణ తీసుకొని వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ, రాష్ట్ర స్థాయిలో మంచి ఫలితాలు సాధించింది.

ఖేలో ఇండియా పోటీల్లో వెయిట్ లిఫ్టింగ్ చేస్తున్న నాని

కాగా పేద కుటుంబానికి చెందిన నాని తన తండ్రి భవన నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టికొస్తున్నాడు. నాని ప్రతి రోజు సైకిల్‌పై సుమారు 12 కిలోమీటర్ల దూరం సైకిల్ తొక్కుకుని వెళ్లి వెలగాడలో శిక్షణ తీసుకుని వస్తుంటుంది. పేదరికం వెంటాడుతున్న అనుకున్న లక్ష్యాన్ని సాధించిందని గరికిపేట గ్రామస్థులు, మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంధర్భంగా ఆమెను కోచ్ బూసరి రవి, మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, గరికిపేట ఉద్యోగులు, యువత తదితరుల అభినందించారు.

గోల్డ్ మెడల్‌తో..

సహకారం ఉంటే మరిన్ని పతకాలు

మాది చాలా పేద కుటుంబం. నాకు ఆర్థిక సహకారం చాలా తక్కువ. మా నాన్న సక్రమంగా పని కూడా చేయడు. నా తల్లి కూలి పని చేసుకుని నన్ను చదివించడంతో పాటు పోటీలకు ప్రోత్సహిస్తుంది. అయితే మా గ్రామానికి చెందిన కొంత మంది పెద్దలు, ఉద్యోగులు క్యాంపులకు వెళ్లేటప్పుడు కాస్త ఆర్థిక సాయం చేస్తున్నారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి సహకారం అందిస్తే మరిన్ని పతకాలు సాధిస్తాను.

బెల్లాన నాని, క్రీడాకారిణి, గరికిపేట.

సప్లిమెంటరీ ఫలితాల్లో విద్వాన్ ప్రభంజనం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఇంటర్ సప్లమెంటరీ ఫలితాల్లో విద్వాన్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎంపిసిలో గెంబలి సాయలక్ష్మీ 465, గొర్లె రమాదేవి 465, గొట్టాపు చరణ్ సాయి 464, మోహిత 463, ఈశ్వరరావు 461, జయదీప్ 460 మార్కులు సాదించి ప్రభంజనం సృష్టించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎం.వేణుగోపాలనాయుడు, సిబ్బంది అభినందించారు.

జి. రమాదేవి(465)

వాసు జయభేరి

ఇంటర్ సప్లమెంటరీ ఫలితాల్లో వాసు జూనియర్ కళాశాల విద్యార్థులు జయభేరి మోగించారు. ఎంపిసిలో సిహెచ్ పావని 464, ఆర్.భార్గవి 464, ఎం.సరిత 464, వి.వరుణ్ కుమార్ 463, ఎ. నాగేంద్రశివ 462, వి.వినయ్ కుమార్ 461, సిహెచ్ శశికళ 560, బైపిసిలో ఆర్.జ్యోతి 432, వి.ఊర్మిల 426, వి.దీపిక 423, బి.తేజ 415, కె. కళ్యాణి 414, పి.గౌరీశ్వరి 406, ఎ. మేఘన 401 మార్కులు సాదించి ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల వ్యవస్థాపకులు రౌతు రామమూర్తి, కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు అభినందించారు.

వారాహి యాత్ర జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టనున్న వారాహి యాత్ర జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం బైపాస్ రోడ్డులో ఉన్న శ్రీదాడితల్లి ఆలయం, పాతబొబ్బిలి శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్ద జనసేన నాయకులు పూజలు చేశారు. రెండు ఆలయాలు వద్ద కొబ్బరి కాయలు కొట్టి వారాహి యాత్ర జయప్రదం కావాలని కోరారు. వారాహి యాత్రతో వైసిపి నేతల్లో భయం నెలకొందని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు అందజేయాలి

ప్రజాశక్తి - కొత్తవలస

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వి. నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ బృందం కళాశాలని సందర్శించి, సమస్యలపై సర్వే చేసింది. అనంతరం సమస్యలపై డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వి.నాయుడు మాట్లాడుతూ కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమస్యలకు నిలయంగా మారిందన్నారు. విద్యార్థులకు రెండేళ్ల నుంచి చదువుకునేందుకు పాఠ్యపుస్తకాలు లేవని, మరోపక్క సెట్, ఇటి, పీడీ సబ్జెక్టులకు పాఠం చెప్పే టీచర్లు లేరని, ఉండేందుకు సరిపడా క్లాస్ రూమ్స్ లేవని అన్నారు. సరిగ్గా లేబ్ సదుపాయం కూడా లేక టీచర్ల రూమ్స్‌లో పెట్టే పరిస్థితి ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ప్రహరీ గోడ లేదని, దీని ఫలితంగా బయట వ్యక్తులు కళాశాల ప్రాంగణాన్ని పాడుచేస్తున్నారని అన్నారు. ఇన్ని సమస్యలుంటే విద్యార్థులు ఎలా చదువుకొని ఉత్తీర్ణులవుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష పాల్గొన్నారు.

డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రాన్నిస్తున్న వి. నాయుడు

రక్తదాతలకు సన్మానం

విజయనగరం టౌన్: ఆపద సమయంలో రోగికి రక్తం ఇచ్చి రోగి ప్రాణాలతో పాటుగా వారి కుటుంబాలకు అండగా నిలిచిన గొప్ప మానవతా మూర్తులు,ప్రాణదాతలు రక్తం అందించినవారే నని జిల్లా పౌర వేదిక అధ్యక్షులు భీశెట్టి బాబ్జి అన్నారు ప్రపంచ రక్తదాతల దినోత్సవం లో భాగంగా మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి మంగళవారం ఇప్పలవలస గోపీ అధ్యక్షతన విజయనగరం ఆర్ టి సి కాంప్లెక్స్ రెవిన్యూ కళ్యాణ్ మండపంలో జరిగిన మెగా రక్తదాన శిబిరంతో పాటుగా రక్త దాతల సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తదానం చేసి ఆదుకోవాలని అన్నారు. ఎటికె సంస్థ అధినేత సామాజిక సేవకుడు అహ్మద్ బాబు మాట్లాడుతూ మైదాన,గిరిజన ప్రాంతాల్లో ని ప్రజలకి రక్త హీనత పెరిగి అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆస్పత్రుల్లో చికిత్స పొందు తున్న రోగులకు రక్తం అత్యవసరంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో మాతభూమి సేవా సంఘం ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, ఆ సంస్థ ప్రతినిధులు రక్త దాతలను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం నాయకుడు పాండ్రంకి సంతోష్, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ అధినేత తాడే పల్లి నాగేశ్వరరావు, మాతృభూమి సేవా సంఘం అధ్యక్షుడు చిరంజీవి, కార్యదర్శి ఇప్పలవలస గోపీ, వి.డెంటల్ అధినేత రమేష్, చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు జగరాపు ఈశ్వర ప్రసాద్, వాళ్లే గౌరునాయుడు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

మెరకముడిదాం: మండలంలోని బైరిపురం సచివాల యం వద్ద మంగళవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 90 మంది రోగులకు తనిఖీ చేశారు. వీరిలో 25 మంది రోగులకు కంటి ఆపరేషన్స్ అవసరమని వైద్యులు శ్రీకాంత్, సంధ్య తెలిపారు. వీరిని విశాఖ తీసుకువెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్స్ చేయించి, ఉచితంగా మందులు ఇస్తామని చెప్పారు. ఈ శిబిరంలో సర్పంచ్ పప్పల విజయ కుమారి, ఉప సర్పంచ్ పప్పల క్రిష్ణ మూర్తి, గ్రహణేశ్వరరావు, కందుల మళ్ళిఖార్జునరావు, ఎంపిటిసి కందుల పార్వతి పాల్గొన్నారు.

పైపులైన్ పనులు వేగవంతం

బొబ్బిలి: మున్సిపాలిటిలో జరుగుతున్న పైపులైన్ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. పైపులైన్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా పైపులైన్ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారు. ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

వైసిపితోనే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -భోగాపురం

వైసిపి ప్రభుత్వంలోనే ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పలనాయుడు అన్నారు. రెండో రోజు మంగళవారం మండలంలోని పోలిపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలు ప్రజలకు అందాలంటే వైసిపికి మరల అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, గ్రామ సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, పిన్నింటి చిన్న తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

మండలంలోని పోలిపల్లి గ్రామంలో పంచాయతీ నిధులతో హుదూద్ బాధితులు గృహాల వద్ద సుమారు రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కర్రోతు శ్రీనివాసరావు, కర్రోతు పైడిరాజు, పిన్నింటి చిన్న, పడాల భానుప్రకాశ్, సుందర హరీష్, పడాల శ్రీను, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పతివాడ రామకృష్ణ, కర్రోతు శంకర్, వివిధ గ్రామాల నాయకులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలను ఆర్‌జెడి తనిఖీ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రావాడ, పోలిపల్లి, మహరాజపేట పాఠశాలలను మంగళవారం ఆర్‌జెడి జ్యోతికుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలిపల్లిలో ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆర్‌జెడి మాట్లాడుతూ విద్యా సంవత్సరంలోనే సిలబస్‌ను పూర్తి చేయాలని, ముఖ్యంగా ఉపాధ్యాయులు విద్యార్థుల నోట్‌బుక్‌లను సరిచేయాలని సూచించారు. ఉపాధ్యాయులు రోజు, నెలవారీ సంవత్సరాంతపు పాఠ్య ప్రణాళికలను కూడా సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని నీలావతి గ్రామంలో మంగళవారం రైతులకు రాయితీ వరి విత్తనాలను జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్ కుమార్, గ్రామపంచాయతీ సర్పంచ్, వైసిపి నాయకులు లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

వివరాలు అప్‌లోడ్ చేయాలి

ప్రజాశక్తి- గంట్యాడ

అంగన్‌వాడీలు ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఐసిడిఎస్ పిఒ ఉమాభారతి అన్నారు. గంట్యాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న వివిధ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధులు నిర్వర్తించడంలో అలక్ష్యం చూపే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్వాడీ కార్యకర్తలు అన్ని రకాల యాప్‌లలో వివరాలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేసి అప్డేట్‌గా ఉండాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను నిర్ణీత వేళలలో తెరచి ఉంచాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు, కార్యకర్లఉ పాల్గొన్నారు.

కూలీల సమస్యలపై నిరసన

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ఏళ్ల తరబడి గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కల్లేపల్లి గ్రామపంచాయతీ సచివాలయం వద్ద కూలీలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలిత సచివాలయ కార్యదర్శి రాజకుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ ప్రతికూలీకి 200 రోజులు పని దినాలు కల్పించి రూ .600 కూలి రేటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో రూ 2.4 లక్షల కోట్లు కేటాయించి మృతి చెందిన ఉపాధి కూలీకి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కళాసీ ఛార్జీలపై విచారణ

ప్రజాశక్తి- గంట్యాడ

2021-22 ఖరీఫ్ ధాన్యం రవాణా, కళాసీ ఛార్జీలపై మంగళవారం మండలంలోని బుడతనపల్లిలో అధికారులు విచారణ చేపట్టారు. వాస్తవానికి రైతు ఖర్చుపెట్టుకుని ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. ఆ సమయంలో రవాణా, కలాసీల ఛార్జీలను బినామీ ట్రాన్స్‌పోర్టు పేరు మీద నమోదు చేశారు. ఇప్పుడు ఆ డబ్బులు రైతులకు కాకుండా బినామీలకు చేరుతున్నందున జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో బుడతనపల్లి రైతులు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో అగ్రికల్చర్ ఆఫీసర్, సిఎస్‌డిటి బుడతనపల్లి ఆర్‌బికె వద్ద విచారణ చేపట్టారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఇందులో కంప్లైంట్ దారు చల్ల పెంటయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

NOTICE
IN THE HONOURABLE COURT OF SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.
E.P 193/2016 FDIA 1185/09 in O.S 37/07

Between:
Pentapati Ramesh Kumar .....D.H.R
And:
Battula Padma ......J.D.R
To
Smt. Battula Padma, W/o Raman Murthy,
Mangala Veedhi, Vizianagaram.

Where as you here by informed that the above named decree holder filed the above E.P. 193/2016, aginst you, the Hon'ble Court Ordered to issue Notice Order 21, R.64 & Rule 66 of C.P.C. Notice to you, Posted to **20-6-2023,** for sale of the mortgaged Property if you have any objections you have to appear in person or through an advocate on that day in the above court at **10-30 am** other wise the matter will be decided in you absence as per law.

P.V.Ganesh
Advocate for DHR
1st Street,
Kothagraharam,
Vizianagaram